రాత్రికో ఇల్లు చేరుకుంటున్నాం.

''ఉద్యోగం రానంతమాత్రాన దిగులెందుకు బాబూ. నాలాగ నలుగురికి ట్యూషన్ చెప్పుకున్నా బతుకు గడిచిపోతుంది'' అంటూ కొడుక్కి ధైర్యం చెప్పేది సంగీత.

దిగులుతో కృశించిపోతున్న కొడుకుని చూసి కడుపు తరుక్కుపోతోంది తల్లికి. 'అయినా తాను మాత్రం చేయగలిగింది ఏముంది. వాని తలరాత ఎలా వుంటే అలా జరుగుతుంది' అనే వైరాగ్య భావాలు మొదలయ్యాయి ఈ మధ్య సంగీతలో.

ఏ ఇంటర్వ్యూకు వెళ్లినా రికమండేషనైనా వుండాలి లేదా దక్షిణ అయినా సమర్పించుకోవాలి. ఉత్త చేతుల్తో ఇంటర్వ్యూకు వెళ్లడం తెలివితక్కువ తనం అన్న నిశ్చయానికొచ్చాడు రాజేంద్ర.

ఇప్పుడు రాజేంద్ర లైబ్రరీకి వెళ్లడం లేదు. పేపర్ చూడటం లేదు. గతంలో ఇంటర్వ్యూలకు వెళ్లిన ఏ ఆఫీసునుంచైనా అపాయింట్‌మెంట్ ఆర్డర్ వస్తుందేమో అనే ఆశ మొదలైంది. పోస్టాఫీసుకు వెళ్లడం, ఏ ఉత్తరాలు రాలేదంటే పార్క్‌కు వెళ్లి ఏ అర్ధరాత్రో ఇల్లు చేరడం ఇది రాజేంద్ర దిన చర్యగా మారింది.

మనిషికి నీరసంగా అనిపిస్తే పోస్టాఫీసుకు వెళ్లకుండా ఇంటిముందు కూర్చొని పోస్ట్‌మ్యాన్ కోసం ఎదురు చూడసాగాడు. తలపై టోపీతో, ఉత్తరాల కట్ట చంకలో ఇరికించుకొని గజేంద్రుని రక్షించేందుకు వచ్చే విష్ణువులా తన ఇంటివైపే వస్తున్నాడు పోస్ట్‌మాన్.

నీరసం వదిలింది. ఉత్సాహంగా లేచి నిలబడ్డాడు రాజేంద్ర.

'నీ ముఖానికి ఉత్తరం కూడానా' అన్నట్లు నిర్లక్ష్యంగా రాజేంద్రవైపు ఓ చూపు విసిరి పక్క ఇంటి వైపు వెళ్లాడు పోస్ట్‌మాన్.

గుండెల్లో బాకు దింపినట్లయింది. 'ఏజ్‌బార్ అవుతోంది. నాకిక ఉద్యోగం రాదు. నా జీవితం వ్యర్థం' అని తెల్లవార్లూ కుళ్లి కుళ్లి ఏడ్చాడు రాజేంద్ర. 'నన్ను మన్నించమ్మా' అంటూ పలవరిస్తున్నాడు.

కొడుకుపై చేయివేసి పక్కనే పడుకుంది సంగీత.

ఎనిమిది గంటలైనా నిద్రలేవలేదు రాజేంద్ర.

'పిచ్చివాడు రాత్రంతా సరిగా నిద్రలేదు కదా. పడుకుని వుంటాడు' అనుకుంటూ టిఫిన్ తయారు చేసింది సంగీత.

''టిఫిన్ చేసి మళ్లీ పడుకుందువు లేమ్మా'' అంటూ కొడుకును లేపింది.

రాజేంద్రలో ఏ చలనం లేదు. ''రాజేంద్రా'' గావుకేక వేస్తూ కుప్పకూలిపోయింది సంగీత.

ఇరుగు పొరుగు కలిసి రాజేంద్రకు అంత్యక్రియలు పూర్తిచేసి ఇంటికొచ్చారు.

''రాజేంద్రకు టెలిగ్రామ్'' అంటూ వచ్చాడు పోస్ట్‌మాన్.

అసిస్టెంట్ మేనేజరుగా రేపే వచ్చి డ్యూటీలో చేరాలని వరంగల్ నుండి వచ్చిన టెలిగ్రాం అది.

''నా కొడుక్కు ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం వచ్చింది'' అంటూ నవ్వసాగింది సంగీత.

'ఒక్కరోజు ముందు ఈ టెలిగ్రాం వచ్చి వుంటే రాజేంద్ర ఇలా పోయేవాడు కాదుకదా. విధి విలాసం ఎంత చిత్రమైంది' అనుకుంటూ వెళ్లిపోయారు.

'నా కొడుక్కు ఉద్యోగం వచ్చింది' అని చెబుతూ తిరుగుతూనే వుంది సంగీత.

**-టి.రామాంజనేయులు**
(హొలహర్వి)

# ఆనందం

**పాపారావు** బంగారం కొట్లో పనిచేస్తున్నాడు.

యజమానిచ్చే జీతం రాళ్లతో నాలుగు వేళ్లూ లోపలికి పోవడానికే భారమైపోతున్న నేపథ్యంలో.. వైరుబుట్టలల్లుకుంటూ, పిల్లల బట్టలు కుట్టుకుంటూనే వేస్తి ళ్లకు చపాతీలు తేడుస్తున్న తాను కూడా సహకరిస్తుంటుందా ఇల్లాలు పద్మావతి.

సూర్యాంబ వాళ్లకి ఒక్కగానొక్క సంతానం. అల్లారు ముద్దుగా పెంచుకుంటూ, అపురూపంగా చూసుకుంటూ పదోతరగతి దాకా చదివించారు ఎన్నో తంటాలుపడి. ఆ తర్వాత ఇంటి పనులూ, వంటపనుల్లో బాగా ఆరితేరింది సూర్యాంబ. ఇలా పదేళ్లు గడిచాయి.

★ ★ ★

"ఏమయ్యా పాపారావ్! అమ్మాయికేమైనా సంబంధాలు చూస్తున్నావా లేదా? నీ వాలకం చూస్తే అసలు అమ్మాయి పెళ్లి ఆలోచనే నీకున్నట్లు లేదు"

"ఏమమ్మా! పెళ్లీడొచ్చిన అమ్మాయిని ఎంత కాలమని ఇంట్లో పెట్టుకుంటావ్? కన్నందుకు ఓ అయ్యచేతిలో పెట్టడం మీ బాధ్యతేగా!" ఇలా అడిగేవాళ్ల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. పిల్లపేరు మీద ఒక్కపైసా కూడా దాచలేకపోయారు ఆ తల్లిదండ్రులు.

★ ★ ★

'ఆడపిల్ల పుట్టింది మొదలు ఇదివరదాకా నోయని నోమూ, మొక్కని దైవమంటూ లేదు. ఇంతకాలం మమ్మల్ని కాపాడుతూ వస్తున్న ఆ ముక్కోటి దేవతల్లో ఏ ఒక్కరైనా మా అమ్మాయి వివాహం గురించి ఆలోచించడం లేదంటే మేమేం పాపం చేశామో. చేతిలో చిల్లిగవ్వ కూడా లేని తరుణంలో చిట్టితల్లి నా సూర్యాంబ వివాహమయ్యేదెట్లానో? అంతా అగమ్యగోచరంగా వుంది' అని తలపోస్తూ దేవుడున్నాడని నమ్మే పాపా




రావు 'కలదు కలందనెడివాడు కలడో లేడో' పద్యం స్ఫురణకు రావడంతో నిరాశా నిస్పృహలతో పడక్కుర్చీలో కూలబడ్డాడు.

"నాన్నా! ఏంటలా వున్నారు? ఏమయింది? ఎందుకు బాధపడుతున్నారు?" అని సూర్యాంబ అడిగేసరికి. "ఏ సంపన్నుల కుటుంబంలోనో పుట్టకుండా కూటికి గతిలేని ఈ పేదవాళ్లింట్లో ఎందుకు పుట్టావమ్మా?" అంటూ కూతుర్ని కౌగిలించుకుని భోరున ఏడ్చేశాడు పాపారావు చిన్నపిల్లవాడిలా!

★ ★ ★

"చూడు పాపారావ్! చాన్నాళ్లుగా నా దగ్గర నమ్మిన బంటులా పడున్నావ్. నేనిచ్చే జీతంరాళ్లు తప్ప నన్నెనాడూ నువ్వు ఏ సాయమూ కోరలేదు. ఇప్పుడైనా అడుగు" అని యజమాని శివానందం అనేసరికి, పాపారావు కళ్లకి దేవుడిలా కనిపించాడు శివానందం.

"బాబుగారూ! అమ్మాయికి పెళ్లి చేయాలన్న ఆలోచన తప్ప ఇంకేం లేదు నా దగ్గర. మీకు చేతనైన సాయం చేస్తే మీకు జీవితాంతం రుణపడివుంటాను" అని పాపారావంటుంటే... "సరే తప్పకుండా చేస్తా. అయితే నా కోరికొకటుంది తీరుస్తావా మరి?" అడిగాడు శివానందం.

"పెద్దోళ్లు! మీకు నేను సాయం చేయగల సాయం ఏముంటుంది బాబుగారూ!" అన్నాడు పాపారావు ఆశ్చర్యంగానూ, అమాయకంగానూ.

"మీ అమ్మాయి పెళ్లి ఖర్చులకి నువ్వెంతంటే అంతివ్వడం కాదు. నువ్వడిగిన దానికి రెట్టింపిస్తా! మరి మీ అమ్మాయి సూర్యాంబని మా ఇంటి కోడల్ని చేస్తావా?" అని శివానందం అభ్యర్థనాపూర్వకంగా అడుగుతూంటే ఆనందంతో నోట మాటరాలేదు పాపారావుకి!

**-కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం**(జగిత్యాల)